AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

1-6-2026 (Monday) MAIN EDITION

## రాష్ట్రంలో తగ్గనున్న ఎండలు



**అక్షరటుడే, హైదరాబాద్:** వాతావరణ శాఖ ప్రజలకు చల్లని కబురు చెప్పింది. గత కొంతకాలంగా మండుతున్న ఎండలు క్రమంగా తగ్గుతాయని పేర్కొంది. వేసవి ప్రారంభం నుంచి రాష్ట్రంలో ఎండలు దంచికొట్టాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అడపాదడపా అకాల వర్షాలు కురిసినా ఎండలు మాత్రం తగ్గలేదు. అయితే నేటి నుంచి ఎండ తీవ్రత తగ్గుతుందని అధికారులు తెలిపారు. మొన్నటి వరకు 45 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీలకు పరిమితం కానున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు..



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఖాళీల భర్తీకి కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలను నియమిస్తూ కేంద్రం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో నలుగురు వివిధ రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు కాగా, ఒకరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కావడం గమనార్హం. ఈ నియామకాలకు సంబంధించిన వివరాలను కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సామాజిక మాధ్యమం అధికారికంగా ప్రకటించారు.

## బెంగాల్‌లో మంత్రివర్గ విస్తరణ



అక్షరటుడే, నేషనల్ డెస్క్: పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి తన మంత్రివర్గాన్ని పూర్తి స్థాయిలో విస్తరించారు. కొత్తగా 35 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మొత్తం మంత్రుల సంఖ్య 41కి చేరింది. 294 మంది సభ్యులున్న బెంగాల్ అసెంబ్లీ నిబంధనల ప్రకారం.. గరిష్ట పరిమితి కంటే ఇది కేవలం మూడు స్థానాలు మాత్రమే తక్కువ.

## ప్రతినెలా మూడు నోటిఫికేషన్లు




అక్షరటుడే, హైదరాబాద్: పరీక్షల నిర్వహణలో ఓఎంఆర్ కంటే సీబీటీ విధానమే ఉత్తమమని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. భవిష్యత్తులో అన్ని పరీక్షలు ఈ విధానం ద్వారానే నిర్వహిస్తామన్నారు. కొత్తగా 3,800 ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు వచ్చాయని, ప్రతి నెలా సరాసరి మూడు నోటిఫికేషన్లు ఇస్తామని వెల్లడించారు.

## మేలో జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు..



అక్షరటుడే, వెబ్‌డెస్క్ : దేశంలోని వస్తు, సేవల పన్ను వసూళ్లు మే నెలలో స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 1,94,184 కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే ఈసారి పన్ను వసూళ్లు 3.2 శాతం పెరిగాయి. మే 2025లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 1,88,172 కోట్లుగా ఉన్నాయి.



## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ రాజీనామా?

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తన పదవికి రాజీనామా చేశారంటూ అంతర్జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాల్లో ఐఆర్‌జీసీతో కూడిన కఠినవాద వర్గాల జోక్యం ఎక్కువైందని, కీలక నిర్ణయాల ప్రక్రియల నుంచి తన ప్రభుత్వాన్ని పూర్తిగా పక్కనబెట్టారని ఆరోపిస్తూ ఆయన తన రాజీనామా లేఖను సుప్రీం లీడర్ కార్యాలయానికి సమర్పించినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' ఓ కథనంలో పేర్కొంది. అయితే, ఈ వార్తలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా తోసిపుచ్చింది. ఇవన్నీ రాజకీయ ప్రేరేపిత అవాస్తవాలని స్పష్టం చేసింది.



## భారీ నష్టాలతో ముగిసిన మార్కెట్లు..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతోంది. ప్రతిపాదిత 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా ఆమోదించలేదు. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి తాను తొందరపడడం లేదని ట్రంప్ పేర్కొనడంతో అనిశ్చిత పరిస్థితులు ఇప్పట్లో తొలగిపోయే అవకాశాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం లాభాలతో ప్రారంభమైంది. ఉదయం సెన్సెక్స్ 428 పాయింట్ల లాభంతో ప్రారంభమై క్రమంగా పడిపోతూ 1,164 పాయింట్లు కోల్పోయింది. చివరికి సెన్సెక్స్ 508 పాయింట్ల నష్టంతో 74,267 వద్ద, నిఫ్టీ 165 పాయింట్ల నష్టంతో 23,382 వద్ద స్థిరపడ్డాయి.

**దేశంలో కమర్షియల్ సిలిండర్ ధరలు మరోసారి పెరిగాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇటీవల గ్యాస్, ఇంధన ధరలను కేంద్రం పెంచుతున్న విషయం తెలిసిందే. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే గృహ వినియోగదారులు వినియోగించే సిలిండర్ల ధరలను కేంద్రం పెంచలేదు.**

– అక్షరటుడే, హైదరాబాద్



# మళ్లీ పెరిగిన గ్యాస్ ధరలు

■ కమర్షియల్ సిలిండర్ రేట్ల పెంపు ■ వినియోగదారులకు షాక్ ■ హోటళ్లు, హాస్టళ్లపై తీవ్ర ప్రభావం

దేశవ్యాప్తంగా పెరిగిన సిలిండర్ ధరలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. 19 కేజీల కమర్షియల్ సిలిండర్‌పై ఢిల్లీలో రూ.42 పెరిగింది. దీంతో ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,113.50 చేరింది. కోల్‌కతాలో రూ.3,255.50, హైదరాబాద్‌లో ధర రూ.3,367గా ఉంది. హైదరాబాద్‌లో తాజాగా సిలిండర్ ధర రూ.52 పెరిగింది. 5 కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ సిలిండర్ పైనా రూ.11 పెంచుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

### యుద్ధం ప్రభావంతో..

అమెరికా, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వాణిజ్య ఎల్పీజీ ధరలు తాజాగా పెరిగాయి. హర్మూజ్ జలసంధి ద్వారా ముడి చమురు, గ్యాస్ సరఫరాలకు అంతరాయంతో ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. ఇటీవలి నెలల్లో వాణిజ్య ఎల్‌పీజీ విభాగంలో ధరలలో తీవ్రమైన హెచ్చుతగ్గులు కనిపించాయి. మే నెలలో, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య సిలిండర్ల ధరను దాదాపు రూ.1,000 పెంచాయి, దీంతో ఢిల్లీ ధర ఒక్కో సిలిండర్‌కు రూ. 3,071.50కి చేరింది. అంతకు ముందు ఏప్రిల్‌లో ధరలు రూ.195.5, మార్చిలో రూ.114.5 పెరిగాయి.

### తీవ్ర ప్రభావం

వాణిజ్య సిలిండర్ల ధరల పెంపుతో ముఖ్యంగా టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లపై భారం పడుతోంది. దీంతో వారు దీనిని వినియోగదారులపై మోపుతున్నారు. ఇప్పటికే అన్ని టిఫిన్ సెంటర్లలో రేట్లను భారీగా పెంచారు. హోటల్‌లో భోజనం ధరలు కూడా పెరిగాయి. హాస్టళ్లు రెంట్లు సైతం పెరగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

### ఐదు నెలల్లో డబుల్

ఈ ఏడాది ప్రారంభం నుంచే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు పెరుగుతున్నాయి. జనవరిలో 19 కిలోల సిలిండర్ ధర రూ.1691.50గా ఉండగా.. ప్రస్తుతం అది 3113.50కు చేరింది. ఐదు నెలల్లోనే ధర దాదాపు డబుల్ అయింది. అమెరికా - ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ఫిబ్రవరిలో రూ.49 రేటు పెంచారు. అయితే నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల తర్వాత కేంద్రం భారీగా రేట్లను పెంచుతోంది.

## 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 24 రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం ఆరు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ స్థానాలకు నామినేషన్లను ఆహ్వానిస్తూ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుంచి అత్యధికంగా నాలుగేసి స్థానాల చొప్పున భర్తీ కానుండగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే జార్ఖండ్ రాష్ట్రానికి సంబంధించిన రెండు రాజ్యసభ స్థానాలకు కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేయడానికి జూన్ 8వ తేదీ వరకు గడువు ఉంటుంది. ఆ తర్వాత మరుసటి రోజైన జూన్ 9న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకోవడానికి జూన్ 11వ తేదీ వరకు సమయం కేటాయించారు.

## కొండగట్టు అంజన్నపై ప్రమాణం చేసే ధైర్యం పవన్‌కు ఉందా?



**అక్షరటుడే, హైదరాబాద్:** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడారు. గతంలో తెలంగాణ సమాజంపై పవన్ కల్యాణ్ తీవ్రమైన విషం కక్కారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల కంటి చూపు పడితే కోనసీమలోని కొబ్బరి చెట్లు ఎండిపోతాయంటూ ఇక్కడి సమాజాన్ని అవహేళన చేసిన చరిత్ర పవన్‌ది అని ధ్వజమెత్తారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తట్టుకోలేక 11 రోజుల పాటు అన్నం తినకుండా ఏడ్చిన ఈ తెలంగాణ ద్వేషి, ఇప్పుడు ఇక్కడికి వచ్చి ఏ మొహం పెట్టుకుని 'నవ నిర్మాణ సభలు' నిర్వహిస్తారని ప్రశ్నించారు.

## రవాణా శాఖలో భారీగా బదిలీలు





**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో భారీగా ఉద్యోగులను బదిలీ చేసింది. చాలా కాలంగా ఒకే చోట పని చేస్తున్న వారికి స్థానచలనం కలిగింది. రాష్ట్రంలో వివిధ శాఖల్లో బదిలీలకు ఇటీవల ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ పూర్తయింది. తాజాగా రవాణా శాఖలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల (ఏఎంవీఐ)ను ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ మేరకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీ జోన్ 1 పరిధిలో 41 మంది ఎంవీఐలు, 42 మంది ఏఎంవీఐలు బదిలీ అయ్యారు. మల్టీ జోన్-2 పరిధిలో 52 మంది ఎంవీఐలు, 40 మంది ఏఎంవీఐలు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఉద్యోగుల అభ్యర్థన, స్పౌస్, ఇతర కారణాలతో బదిలీలు చేపట్టారు. పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రవాణా శాఖలోని ఐదు జోన్ల పరిధిలో పని చేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లను కూడా ట్రాన్స్‌ఫర్ చేశారు.


## 'స్వయంభూ' నుంచి పోస్టర్ రిలీజ్

**నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభూ చిత్రం నుంచి పోస్టర్ రిలీజ్ అయింది. నిఖిల్ పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ హీరో లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్న ఈ పిరియాడిక్ డ్రామాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ మూవీలో నిఖిల్ పక్కన హీరోయిన్లుగా సంయుక్త మీనన్, నభా నటేశ్ నటిస్తున్నారు. సోమవారం నిఖిల్ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ హీరో లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేసింది. అంతే కాదు, ఈరోజు సాయంత్రం 4:05 గంటలకు నిఖిల్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన బర్త్‌డే స్పెషల్ వీడియో కూడా విడుదల కానుంది.**

– అక్షరటుడే, సినిమాడెస్క్




## బావిలోకి దూసుకెళ్లిన కారు



**అక్షరటుడే, జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి వద్ద ఓ కారు అదుపు తప్పి బావిలోకి దూసుకెళ్లింది. నివేష్, అశ్విన్, అరుణ్ అనే ముగ్గురు యువకులు థార్ వాహనంలో మొబైల్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ చూస్తూ ప్రయాణించారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న జగిత్యాలకు చెందిన అరుణ్ బావిలో మునిగి మృతి చెందగా.. నివేష్, అశ్విన్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు రెండు గంటలు శ్రమించి అరుణ్ మృతదేహాన్ని, కారును బయటకు తీశారు.

## హెచ్‌సీఏ అక్రమాలపై సిట్ ఏర్పాటు




**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాలపై విచారణ కోసం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. హెచ్‌సీఏపై నమోదైన నాలుగు కేసులు సిట్‌కు బదిలీ చేసింది. అసోసియేషన్ అనేక వివాదాలకు కేంద్రంగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గతంలో పలు కేసులు నమోదయ్యాయి. అంతేగాకుండా బీసీసీఐ నుంచి వచ్చిన నిధులు దుర్వినియోగమయ్యాయని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో తాజాగా ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా.. హెచ్‌సీఏ అధ్యక్ష కార్యదర్శులను సీఐడీ ఇప్పటికే అరెస్ట్ చేసింది.